

# పిల్లలూ దేవుడూ చల్లని వారే...

అరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

"బాబూ! ఎక్కడున్నావ్ రా?"

చదువుతూన్న పుస్తకంలోంచి తలెత్తి హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినదానిలా కేక వేసింది సుహాసిని.

తిరుగు జవాబు లేదు.

"అబ్బబ్బ. పసివాళ్ళు పసివాళ్ళల్లే వుండరు. ఇల్లూ, వీధులూ అన్నీ వీళ్ళే కలదిరగాలి. క్షణం చూడకపోతే కన్నుగప్పి ఎటో మాయమౌతారు" అని లోలోన విసుక్కుంటూ పుస్తకం ప్రక్కన పెట్టి లేచి వెళ్ళింది.

"ఇల్లంతా వెదికాను. వీధి తలుపు వేసేవుంది. ఇంకెటు వెళ్లాడబ్బా!" తల గోక్కుంటూ పైకి చూచింది. ఆలోచిస్తూ పైకెక్కింది. అనుకున్నట్టే కృష్ణ డాబా మీద ఒక్కడూ వున్నాడు. చూడగానే గుండె ఆగినంత పనైంది. పిట్టగోడ అంచులు పట్టుకొని కాళ్ళు ఎత్తి ఎత్తి అవస్థ పడ్తూ అవతలి దొడ్లోకి చూస్తున్నాడు.

"ఓర్నీ. రెండేళ్ళైనా లేనివాడివి నీకప్పుడే మేడలూ, డాబాలూ, షికార్లూనా? అవతలేముందిరా అంతగా కాళ్ళెత్తి, మెడ ఎత్తి అవస్థపడ్తూ చూడటానికి?" అంటూనే కృష్ణుడిని ఎత్తుకుని, యథాలాపంగా అవతలిదొడ్లోకి చూచింది. ఇంచుమించు కృష్ణుడి వయసేవున్న పాప అందంగా అమాయకంగా నవ్వుతూ ఇటే చూస్తోంది. ఎంతైనా ముచ్చటైంది సుహాసినికి.

"మీ ఇద్దరికీ స్నేహమైందన్నమాట! చాలా బాగుంది," అని కొడుకును ముద్దులాడుతూ ఎత్తుకుని క్రిందకు దిగబోయింది. అంతలో మళ్ళీ ఆగి మట్టిలో ఒక్కతీ కూర్చునివున్న ఆ పాపదెస సానుభూతితో చూచింది. పిట్టగోడ వేపుగా కొంచెం వంగి అవతలి యింట్లోకి చూస్తూ "ఎవరండీ. లోపల?" అని రెండుసార్లు పిలిచేసరికి, తల మునకలుగా పనితో సతమతమౌతున్న విషయం సూచిస్తూ ఒక యిల్లాలు బయట కొచ్చింది – ఒక చేతిలో గరిట, మరో చేతిలో ఏదో మసిబట్టతో.

"చూడండీ, మీ అమ్మాయే ననుకుంటాను. పాపం, ఒక్కతీ మట్టిలో కూర్చుంది."

"ఔనమ్మా ఏం చేస్తాం? ఇంట్లో మరో దిక్కులేదు. నాకు పనీ, దానికి మురికిలో ఆటలూ..."

నవ్వింది సుహాసిని. "నా పనీ అంతే లెండి. ఇప్పుడే కాస్త పని ముగించుకుని నడుం వాల్చానో లేదో, వీడు ఈ పైకెక్కి కూర్చున్నాడు. ఇల్లంతా వెతికి గాబరా పడ్డాను. అందుకే మిమ్మల్నీ పిలుస్తున్నాను, పాప ఎప్పైనా వెళ్ళిపోతుందేమో నని!"

"మంచిపని చేశారు. ఈ పిల్లల మూలాన మనం పరిచయమయ్యాం ఇవాళ. అయితే మీరు క్రొత్తగా వచ్చారా ఈ యింట్లోకి?" అవతలి యిల్లాలు ఆరా తీసింది.

"ఔనండీ, రెండు వారాలైంది."

"వస్తా, మరి పనుంది."

ఎవరి బిడ్డతో వాళ్ళు యిండ్లలోకి నిష్క్రమించారు.

క్రమంగా కృష్ణ, పాపేకాకుండా తల్లులుకూడా తీరికసమయాలు అక్కడే నిల్చుని మాట్లాడుకోవటం అధికమైంది.

'పాపా' 'కుత్నా' అనుకుంటూ పిల్లలు ఒకరు డాబామీదా ఒకరు క్రిందాకూర్చుని రోజులో మూడోంతులు భాగం గడిపే వారు.

"ఏమండీ సుహాసినిగారూ, పనైందా? వంట ఏం చేశారూ?" అంటూ అవతలా విడ పిలవటం

"విశేషా లేమిటండీ రాధగారూ? రాత్రేం సినిమా చూశారూ? మీ పాపకు నిన్న వేసిన గౌ నెంతా?" అంటూ సుహాసిని సంభాషణలోకి దిగటం.

"ఏమిటోయ్, అంతకంతకూ గోడ దగ్గర క్లబ్బు మీటింగు లెక్కువైపోతున్నాయీ? మరీ అంత విడరాని స్నేహమే అయిపోయిందా?" అంటూ పరిహాసించాడు ఒకనాడు శేషాద్రి సుహాసినిని.

"ఔను. మీ మీటింగులు క్లబ్బులలోనూ, పార్కులలోనూ, కాఫీ హోటళ్ళలోనూ, మా మీటింగులు గోడలమీది నుంచీ, పేరంటాలలోనూ మరి!" అన్నది కొంచెం నిష్ఠురంగా.

"అబ్బే, నేను మరోకందుకనలేదు. ఊరికేనే పరిహాసమాడాను. అయితే నీ కొడుకు నీకు మంచి స్నేహితురాలినే వెదికి పెట్టాడు!"

"ఇంకానయం. వాడే వెతుక్కున్నాడు ఓ స్నేహితురాలిని. అన్నీ తండ్రిగుణాలు!"

"మంచిదేగా!"

ఇద్దరూ పకపకా నవ్వుకున్నారు.

"ఆడబుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు. పసివాడిని నాతోపోలుస్తావా?" అన్నాడు శేషాద్రి తిరిగి.

"ఔను కానీ......వాళ్ళ పాప ఎంత బాగుంటుందనుకున్నారు? చూచారా మీరు?" సంభాషణ మార్చింది.

"నేను చూడ్డమెందుకూ, నువ్వూ నీ కుమారుడూ చూస్తున్నారుగా రోజూ? చాలు."

"అయ్యో విడ్డూరం! మిమ్మల్నేదో పెళ్ళిచూపులు చూడమన్నట్టు బాధపడతారేం? మగబుద్ధి పోనిచ్చుకున్నారుకాదు."

"ఇంతకీ ఏమంటావ్? నీకూ కావాలా ఓ పాప? ఇల్లుపీకి పందిరేసే ఈ కొడుకు చాల్లేదా?"

"అబ్బబ్బబ్బ! మో టు హా స్యా లూ మీరూనూ!" సుతారంగా విసుక్కుంది.

రాధభర్త గోపాలం మరోతరహామనిషి. ఆడవారి స్నేహాలను గురించిన అతడి వ్యాఖ్యానాలు మరోరీతిగా వుండేవి.

"ఏం రాధా! కూర యిలా పాడైందేమిటి? వంటమాట మరచిపోయి ఆ సుహాసినితో సంభాషణకు దిగావా?"

"సరే. ఒక్కరోజు ఎప్పుడైనా ఎవరికి మాత్రం పాడవదు? దానికే అన్ననాలా?"

"అదికాదు మరి. నే నన్నాననికాదు గానీ చూడు-గంటలకు గంటలు ఆ గోడవ తలావిడతో సంభాషణ వేసుకుని కూర్చోక పోతే, ఇల్లు ఇంత చీదరగా వుండదుకదా? మొక్కుబడిగా ఒండుకోవడం, తినడం - యింతేనా? కాస్త యిల్లు శుభ్రంగా వుంచుకోవాలనీ, మనిషివి శుభ్రంగా అందంగా తయారవాలనీ, ఆ చేసుకునే వంటేదో నోటికి రుచికరంగా వుండాలనీ వుండదూ నీకు?"

"సరే లెండి. మీ సాధింపు నాకు రోజూ అలవాటేగా? అయినా యిదేం విడ్డూరం బాబూ, కాస్త యిరుగూ పొరుగులతో మాట్లాడకుండా ఎలాగుండేది?ఎంత సేపూ యింటి గోడవేనా?"

"సరేలే. నే చెప్పేది చెప్పాను. ఆపైన నీ యిష్టం. అయినా మీ ఆడవాళ్ళ స్నేహా లెంత, నాకు తెలియనివా? చదువూ సంధ్యా, వివేకం, విజ్ఞానం శూన్యం. ఆవిడనగలనీ, ఈవిడ చీరలనీ మరొకరి భర్తనూ గురించి చర్చించుకోవడం, ఆ తర్వాత అసూయ జెందడం..."

"చాల్లెండి." ఈసారి రాధకు నిజంగా కోపం వచ్చింది. "మీ మగవారు మాత్రమేం తక్కువ? ఒకడు ఎందరి కాళ్ళు పట్టుకుని అంత పెద్ద ఉద్యోగంలో వున్నాడో, మరొక డెంత లంచాల గడ్డితిని బాగా సంపాదించాడో, ఇంకొక డెంతగా తాగి తందనా లాడతాడో చాటుగా చర్చించుకుని నవ్వుకోవడం, ఎదరమాత్రం "భాయీ భాయీ" అని బుజాలు రాసుకుంటూ తిరగడమేగా మీ సరదాలు? నాకు తెల్సులెండి!"

గోపాలం కోపంతెచ్చుకోలేదు. "అబ్బా! అయితే నీకూ చాలా ప్రపంచజ్ఞాన మున్నదన్నమాట! అయితే మీ రిద్దరూ ఆ గోడ కటూయిటూ నుంచుని యిటువంటి అమూల్య విషయాలుకూడా చర్చించు కుంటూంటా రన్నమాట!" అంటూనే నవ్వేస్తూ వెళ్ళిపోయాడు.

"ఇంతకూ మన మాటలలో మరిచే పోయాము. ఏదీ పాప?" అంటూ మళ్ళీ వెనక్కు వచ్చాడు.

"ఇం కెక్కడుంటుంది? దొడ్లోయిదీ, ఆ డాబామీద వాళ్ళ బాబూ. బలేనేస్తం లెండి."

ఇద్దరూ పెరటివేపుగా నడిచారు.

అక్కడి దృశ్యాన్ని యిద్దరూకూడా నిజంగానే కాస్సేపు తన్మయులై చూశారు. పాప తన రబ్బరుబొమ్మను డాబామీది కృష్ణకు గర్వంగా చూపుతోంది. వచ్చీరాని మాటలతోనే మెచ్చుకుంటూ కృష్ణ తనదగ్గరున్న పాతపేకముక్కలూ బిస్కట్లూ పాపదగ్గరకు విసుర్తున్నాడు.

"స్నేహమైతే బాగానేవుంది కానీ, ఇటువంటివి మాత్రం అలవాటుచేయకు. చూడు-ఆ మట్టి అంటిన బిస్కట్లు తీసుకు తింటోంది. అనారోగ్యం కదూ? వాళ్ళ బాబుని యిక్కడైనా రప్పించు; లేదా మన పాపను కాస్సేపు అక్కడికైనా పంపించు. అలా బాగుంటుంది. ఇది మట్టిలోనూ, వాడా డాబాపైనా-ఏమిటిది అసహ్యంగా?

కాస్త నామాటకు అడ్డం చెప్పకుండా అర్థం చేసుకుంటే బాగుంటుంది."

"మీది మరీచోద్యం. పిల్లలు మట్టిలో ఆడకుండా, తినకుండా వుంటారా? వాళ్ళకిప్పుడే ఆరోగ్యసూత్రాలూ, క్రమశిక్షణా ఏం తెలుస్తుందీ? పసివాళ్ళు పాపం. ప్రేమలూ అభిమానాలే కాని యింకేం వుండవు. వాళ్ళ అమ్మ తినడానికేం పెట్టినా పాపం – దీనికిస్తేకాని తినడు కృష్ణ–ఇదీ అలాగే. ఆ పాలకూ నీళ్ళకే యింట్లోకి వస్తుంది కాని ఎప్పుడూ అక్కడే..."

"వాడు గిరవాటేసినవన్నీ ఏరుకు తింటూ కుక్కలాగా అక్కడే పడుంటుందన్నమాట! బాగుంది, చాలాబాగుంది!" అంటూనే కోపంగా పాపదగ్గరకు వెళ్ళి "తప్పు తల్లీ. ఇలామట్టిలో కూర్చోవచ్చా? పద లోపలికి," అన్నాడు.


పాప "రా" నని మొరాయించింది.

"అరే. ఇప్పటినుంచీ పెంకితనం! పద లోపలికి," కసురుకుంటూ ఒకవిధంగా బలవంతంగానే లోపలికి తీసుకుపోయాడు, రానని గింజుకుంటూ ఏడుస్తూన్న కుమార్తెను.

కృష్ణకోసం అప్పుడే డాబామీదికి వచ్చిన సుహాసినికంట ఆదృశ్యంపడడమూ కృష్ణకంటె అధికంగా ఆమె వదనం చిన్నబోవడమూ, గోపాలం గానీ అతడి ననుసరించి లోనికి వెళ్ళిపోయిన రాధగానీ గమనించలేదు.

ఆ రోజునుంచీ, రాధతో ఎప్పుడు మాట్లాడుదామనుకున్నా సుహాసిని మనస్సులో ఏదో ముల్లు గ్రుచ్చుకున్నట్లై మాటలు మానుకుంది.

భర్తతో మాటకుమాట వాదించనైతే వాదించింది కానీ ఆ తర్వాత ప్రతినిమిషం ఏదో అనుమానం, శంకా రాధ మనస్సును కుమ్మరిపురుగుల్లాదొలచసాగాయి. 'అవును అదేమిటీ ఆవిడ ఆ కృష్ణను ఎప్పుడూ అలా డాబామీదనే నుంచోబెడుతుందీ? కాస్త అలా త్రిప్పి మా యింట్లోకి




పంపిస్తే తప్పు కాబోలు! ఎంతైనా బాగా పెద్ద జీతగాడి భార్యకదూ–అంచేత సంపాదించే భర్తకన్న ఈవిడకే ఎక్కువగర్వం వుండడం సహజం. ఆయన అన్నారంటే ఊరికే అన్నారా – ఎవరైనా మగవారికి లోకజ్ఞాన మెక్కువ! అక్కడినుంచి, ఏదో గతిమాలిన వాళ్ళకి పారేస్తున్నట్టు విసురుతాడేమిటి ఆ పిల్లవాడు, బిస్కట్లవీనీ? పసివాడైనా యిప్పట్నుంచీ ఎంత గర్వం? ఎంత పొగరూ?"

అందుకే ఆ మర్నాడు పనై తీరిక చిక్కిన అనంతరంకూడ రాధకు సుహాసినితో మాట్లాడాలనిపించలేదు. ఫలితంగా ఆ రోజు గోడదగ్గర సభ నాగాపడింది.

"ఏ మబ్బా, నేను మాట్లాడకున్నా ఆవిడైనా పిలిచింది కాదూ?" అనే సందేహం మాత్రం ఆమెను పీడిస్తూనే వుంది.

ఇటు రాధా, అటు సుహాసినీకూడా ఒకామె పిలుస్తుందేమోనని మరొకరు ఒక చెవి అటు వుంచే వున్నారు. కాని ఎవరు ఆశించిందీ జరగలేదు. ఎవరి బింకంలో వారే వున్నారు.

కల్మష కార్పణ్యా లెరగని కృష్ణ మాత్రం పాలు, స్నానం అయిపోగానే తన మామూలు అలవాటునపోయి డాబామీద కూర్చున్నాడు. "పాపా, పాపా ఏం జేత్తున్నావూ?" అంటూ రెండు మూడుసార్లు పిలిచాడు. కాస్సేపటికి ఇంటిలోపల ఎక్కడినుంచో పాప రోదన అయితే విన్పించింది కాని, కృష్ణ డాబాపై ఎంతసేపు వేచివున్నా ఆ పిల్ల బయటకు మాత్రం రాలేదు. చాలా సేపటికి ముఖం వేళ్ళాడేసుకు వచ్చేసిన కృష్ణను గమనించింది సుహాసిని.

"పాప లాలేదు," అన్నాడు దిగులుగా.

"పోనీలే. దా. నువ్వూ నేనూ కబుర్లు చెప్పుకుంటూ ఆడుకుందాం. ఏవీ నీ బొమ్మలన్నీ ఇలా తే," అన్నది సుహాసిని.

మాట్లాడకుండా కృష్ణ బొమ్మలు తెచ్చాడు కాని తల్లి ఆటపాటలు వాడికేమీ రుచించినట్లు కన్పించలేదు. కాస్సేపటూ యిటూ తిరిగి, కుర్చీలూ బల్లలూ త్రోసి తల్లిచేత చీవాట్లుతిని, పాలుత్రాగి మళ్ళీ డాబా ఎక్కాడు. ఈ సారికూడా ఉదయపు ఫార్సే తిరిగి జరగటం గమనించింది సుహాసిని. "ఎందుకురా అలా చెవి కోసిన మేకల్లే అరుస్తావ్? రా క్రిందికి," అని రెండు మూడుసార్లు విసుక్కుంటూ పిలిచింది కాని, కృష్ణ విన్పించుకోలేదు.

సాయంత్రం శేషాద్రి ఇంటికి వచ్చేసరికి

కూడా "పాపా, పాపా" అని పిలుస్తూ కృష్ణ వైననే వుండడం చూచి, విసుక్కున్నాడు. "ఏమిటా వెధవని బొత్తిగా అలా గాలికి వదిలేస్తున్నావ్? ఇహ నిత్యం ఆ డాబామీద నేనా వాడి బ్రతుకు? తీసుకురా క్రిందికి."

సుహాసిని మాట్లాడలేదు.

"అయినా ఆవిడ కంత గర్వమేమిటి? కాస్త ఆ పిల్లని ఆడుకురమ్మని మన యింటికి పంపించరాదూ? ఇన్నాళ్ళ పరిచయమన్న మాటేకాని ఆవిడకూడా ఎప్పుడూ వచ్చినట్లు లేదే!"

అప్పుడైతే సుహాసిని మాట్లాడలేదు కానీ భర్త మాటలు ఆమె మనసుకు బాగా పట్టాయి. "ఔను. ఎందుకూ, ఏం చూచుకొని ఆవిడ కా గర్వం? ఇంతోటి రెండొందల జీతగాడి భార్యకే యింత టెక్కూ నిక్కూనా? ఏ ముందనీ?"

రాధ మాత్ర మేం తీసిపోయిందా? "ఔనులే. ఆ యింటావిడ కేదో గర్వం వచ్చింది. నే నమ్మా మగపిల్లాడి తల్లినీ. పెద్ద ఉద్యోగస్తుడి భార్యనీ అని! అందులోనూ ఈ మధ్య ఓ స్కూటర్ కూడా కొనుక్కున్నారాయె!"

మగవాళ్ళు యథాలాపంగా అన్న మాటలు ఆ సాధారణ స్త్రీలమీద బాగా పనిచేసి వారి అంతరాంతరాలలో వున్న అసూయను పైకి లాగి తెచ్చి, కుక్కలను ఉసికొల్పినట్లుగా చేసివదిలాయి. ఫలితంగా గోడదగ్గర సంభాషణలు ఆగిపోవటమే కాకుండా, చిన్న చిన్న అవసరాలకు, ఒకరి నొకరు చనువుగా అడిగి తీర్చుకునే పద్ధతి కూడా పోయింది. ఎప్పుడైనా ఏ బట్టలు ఆరవేయడానికో సుహాసిని మేడమీదకు వెళ్ళితే, రాధ కన్పిస్తే ఇద్దరూ ముఖాలకు ప్రయత్నపూర్వకంగా ఓ నవ్వు పులుముకునేవారు. అంతే రానురాను కృష్ణ ఎక్కువగా సాయంత్రాలు తండ్రితో స్కూటర్ మీదనే తిరగసాగాడు. అయినా పెద్ద వాళ్ళకున్నంత కథులూ, పట్టుదలలూ తెలియనివాడు కావడంతో ఏదో ఒక సమయంలో డాబామీది కెక్కి అవతలి పాప స్నేహం నిలుపుకోవటానికే ప్రయత్నించేవాడు.

నిజానికి ఆ పసివా ళ్ళిద్దరి స్నేహానికీ తనకేం అభ్యంతరం లేకపోయినా, పాపను అవతలి దంపతులు కట్టడిలో పెట్టడం గమనిస్తూన్న సుహాసిని మాత్రం వారి ఆ చర్యను భరించలేకపోయింది. అందుకే తానూ నిర్లక్ష్యం చేయడం ప్రారంభించింది. కాని అటు రాధ, ఇటు ఈమె కూడ మాటిమాటికీ ఒకరినొకరు పలుకరించుకొనే అలవాటుండటంవల్ల, ఈ అకారణ విరోధం వచ్చాక, తీరిక సమయాలలో బొత్తిగా ఏమీతోచక బాధపడ్తూ గడపసాగారు.

"ఇరుగూ, పొరుగూ తోడు నీడలా గుండాలన్నారు! ఛ. గర్విష్టివాళ్ళు పొరుగున వుంటే అంతా యిబ్బందే బాబూ! ఓ మాటా, మంచా?" అని రాధ అప్పుడప్పుడు పెరట్లోనుంచి తనకు విన్పించేలాగ అనడం సుహాసిని వినికూడా ఏమీ మాట్లాడలేదు. అప్పుడప్పుడు ఆమెఅకారణ కోపానికి పాప వీపు దెబ్బలకు గురికావడంకూడా జరిగేది. అది గ్రహించిన సుహాసిని కొద్దిగా బాధపడి ఊరుకునేది.

"ఏమోయ్, సభలూ సమావేశాలూ కట్టైపోయాయి? ఏం వచ్చిం దేమిటి? నే చెప్పలేదూ ఆడవాళ్ళ స్నేహా లింతేననీ?" అంటూ శేషాద్రి పరిహాసమాడాడు రెండు మూడుసార్లు సుహాసినిని.

ఆమె జవాబీయలేదు.

"ఇంకా వైరమేనా? సంధిప్రయత్నాలేమైనా జరుగుతున్నాయా?" అనడిగాడు ఒక ఉదయం ఫలహారం చేస్తూ శేషాద్రి.

"వైరమూలేదు. సంధీలేదు. తటస్థ విధానమే," అన్నది సుహాసిని ముక్తసరిగా.

"పోనీలే, ఏదో ఒకటి కాని నా ప్రాణం మాత్రం హాయిగా వుంది. వేళకు అన్నీ యిస్తున్నావ్, పిలవగానే పలుకుతున్నావ్."

ఉదయం పనిపాటలతో తీరికలేకుండా వున్న సుహాసిని పరిహాసానికీ పకపకలకూ సిద్ధంగాలేదు. "మిమ్మల్నేం వ్యాఖ్యానించమనలేదు కానీ, ఓపికవుంటే కాస్త ఆ కృష్ణగాడికి టిఫిన్ తిన్పించి పాలుతాగించండి. నా కెక్కడా తీరికలేదు. ఇవ్వాళ పనిమనిషి రాలేదు."

"ఇంకా నయం. అందుకని అంట్లు తోమమన్నావ్ కాదు. నేను ఆఫీసు కాగితాలలో తల దూర్చాలి యిక. వాడిని చూచిన తర్వాతనే పనులుచూసుకో" అంటూ వెళ్ళిపోయాడు ఆఫీసుగదిలోకి.

ఉక్రోషంతో ఉడుక్కుపోయింది సుహాసిని.

"కృష్ణా! కృష్ణా!" అంటూ కేకలు వేసినా వాడు పలుకలేదు. "అబ్బబ్బ చస్తున్నానురా నీతో. ఒక్కడవైనా, పదిమంది పెట్టు" అనుకొంటూ మేడపైకి వెళ్ళింది. యథాలాపంగా ప్రక్కదొడ్లోకి చూచిన ఆమెకు అక్కడ పాప నాలు గైదురకాల బొమ్మలతో కూర్చుని, కృష్ణుడికి ఒక్కొక్కటే సంతోషంగా చూపుతూ మురిసిపోవటం కన్పించిది.

"పిల్లగోంగూరా. యియ్యి. బాగుంది" అంటున్నాడు కృష్ణుడు.

అదేం మాటో అర్థంకాక అట్టేనిలబడిపోయి కృష్ణుడివైపూ, పాపవైపూ తేరిపార చూడసాగింది సుహాసిని.

"పిల్లగోంగూరా! ఇటియ్యి. నాకూ కావాలీ!" మెల్లగా మారాంలోకి దిగింది కృష్ణ కంఠస్వరం.

అంతలో లోపట్నుంచి రయ్యిమంటు రానేవచ్చింది రాధ. "ఏమమ్మా, మీరు ఎంత గొప్పవాళ్ళైతే మాత్రం అలా దగ్గరేవుండి పిల్లవాడిచేత పేర్లు పెట్టి పిల్పించడం ఏమైనా బాగుందా? గొప్ప వాళ్ళు గొప్పవాళ్ళకు మల్లే వుండండి. మాతో మాట్లాడ్డం మానేశారుగా? ఇంకా

యిలా అవమానించడం దేనికి?" కడుపులో వున్న కక్కసంతా కక్కేసింది.

నిర్ఘాంతపోయింది సుహాసిని. "ఏమిటండీ మీ రనేది? దగ్గరుండి నేనే పిలిపిస్తున్నానా? అంతటి హీనపుతల్లి ఎక్కడైనా వుంటుందా అసలు? అయినా యిప్పుడు అసలేం జరిగిందీ?" మెల్లగానే అడగాలనుకున్నా విసుగ్గా వున్న ఆమె మనసు అలా జరగనీయలేదు. రాధకే మాత్రం తీసిపోకుండానే వున్నది సుహాసిని కంఠస్వరంకూడా.

"అయ్యో! ఎంత నటన! ఎంత అమాయకత్వం!" చేతులు త్రిప్పుకుంటూ అభినయించింది రాధ. "నా చెవులతో నేను వినలేదనుకున్నారా "పిల్లగోంగూరా" అనడం? అదిగో ... అదిగో చూడండి యింకా అలానే పిలుస్తున్నాడు. అయితే అది "పిల్లగోంగూర", మేం పెద్ద గోంగూరలమన్న మాట! మేం గుంటూరు వాళ్ళమనేగా మీ రటువంటి పేర్లతో పిలుస్తూన్నదీ?"

మొదట ఉప్పెనగా నవ్వు వచ్చింది సుహాసినికి, ఆ పేర్లను ఆమె అన్వయించుకున్న తీరుచూచి.

"నవ్వవమ్మా, నవ్వు నవ్వు. నే నమ్మా యింత ఘనకార్యం చేయిస్తున్నాను రెం డేళ్ళైనా లేని పసివెధవచేతా అని! ఆనక మీరే అనుభవిస్తారు, వాడు మేకై కూర్చున్నాక?"

"చాల్లే, మాటలు జాగ్రత్తగా రానీయ్," ఉరిమింది సుహాసిని. "విషయం తెలియకుండా ఎందు కంతంత లేసి మాట లంటావ్? నిజంగా చెప్తున్నాను, నాకేం తెలియదు. నేనూ యిదే వినడం," అంటూ కొడుకుదెస తిరిగి, "ఏమిట్రా, ఏమిటదీ?" అడిగింది. వాడి కేమైనా విన్పిస్తేనా? "అదిగో పిల్లగోంగూరా, నా క్కావాలి" అంటూ పాపదెసచూస్తూ ఏడుపుకూడా లంకించుకున్నాడు.

"ఛీ పాడు సంత, దరిద్రపు పోరుగు,"



అంటూ పిల్లనూ బొమ్మలనూ కలిపి ఈడ్చుకుపోయింది రాధ లోపలికి.


పిచ్చెక్కిపోయిన సుహాసిని కొడుకును రెండు అంటించి మరీ క్రిందికి లాక్కువచ్చింది. "దరిద్రుడా, అదెక్కడి పేరురా, నీ గోల తగలెయ్యా," అని కూడా విసుక్కుంది. "భర్త కొట్టినందుకాదు, తోటికోడలు నవ్వినందుకు" అన్నట్టుగా ఆమె కోపం, ఉక్రోషం మరింత అధికమయ్యాయి క్రిందినుంచి అంతా గమనించుతూన్న భర్తను చూచి.

"ఎందుకలే సుహాసినీ కొట్టకు. పసివాడు-ఏదో అంటున్నాడు. మన కర్థం కావటంలేదు. ఇటియ్యి," అంటూ కృష్ణను తీసుకొని బయటకు తీసుకుపోయాడు.

తాత్కాలికంగా గాలివాన వెలిసినా, తిరిగి ఆ సాయంత్రం ఒకసారీ, మర్నాడు మధ్యాహ్నం మరోసారీ అదే సంఘటన జరిగింది. డాబామీద. అక్కడ పాపవున్నా సరే లేకున్నాసరే కృష్ణ "పిల్లగోంగూరా, పాపా!" అని కేకలు పెట్టడం, ఆ వెనుకనే ప్రవాహంలాగా రాధ తిట్లూ దీవనలూ. విసిగిపోయింది సుహాసిని. "ఛీ ఛీ, లేనిపోని సమస్య పట్టుకుంది నాకు," అనుకుంటూ కొడుకును హమేషా కాపలా కాయడం మొదలుపెట్టింది డాబామీదికి వెళ్ళకుండా. చేతిలో ఎంతపనివున్నాసరే, కృష్ణ ఏడ్చేటప్పటికి లేదా డాబావైపు దారితీసినప్పుడు అమాంతం ఆ చేతిలో పని వదిలేసి, వాడిని ఎత్తుకు త్రిప్పసాగింది సుహాసిని. ఒకరోజంతా ఏ గొడవా లేకుండా మామూలుగా గడిచింది. సుహాసిని తేలికగా ఊపిరి పీల్చుకోబోయేసరికి తిరిగి సాయంత్రం మామూలు గోల ప్రారంభమైంది.

వాహ్యాళికి బయటకు వెళ్దామని స్నానం చేయించుతూన్న తల్లి చేతులకు లొంగకుండా, హఠాత్తుగా పూనకం వచ్చినవాడిలా గింజుకుంటూ ఏడవసాగాడు కృష్ణ, "అదిగో పిల్లగోంగూరా, కావాలి నాకూ" అంటూ.

"ఏమిటది?" అంటూ అప్పుడే ఆఫీసు




నుంచి వచ్చిన శేషాద్రికూడా వెళ్ళాడు స్నానాల గదిలోకి.

"ఏమో, ఏం పోయేకాలమో !" బాగా విసిగిపోయినట్లుంది సుహాసిని సమాధానం. "శుభ్రంగా కుదురుగా స్నానం చేస్తూన్న వాడల్లా మళ్ళా గుర్తుకు వచ్చినట్లుగా ఏడుస్తున్నాడు చూడండి. ఇహ ఆ పొరుగావిడ తిట్లకు లంకించుకుంటుంది. ఏం చేయటం ?"

శేషాద్రికికూడా ఏంతోచక అయోమయంగా చూస్తూ బుఱ్ఱగోక్కున్నాడు. "పోనీలే కొట్టకు పసివెధవని. నేను చూసుకుంటాలే. నువ్వు వెళ్ళి పని చూసుకో," అని సుహాసినిని పంపివేసి కృష్ణకు తరవాయి స్నానం తానే చేయించి ఓపికగా పౌడరు వేసి బట్టలు తొడిగాడు. "దా బాబూ, మనం యిద్దరం అలా బయటకు పోదాం. అల్లరి చేస్తే మరి అమ్మకు విసుగొస్తుంది," అంటూ కృష్ణని బయటకుతీసుకుపోయాడు.

నాలుగువీధులు తిరిగి పార్కులోకి వెళ్ళి కూర్చున్నారు. అక్కడ పూల మొక్కల్ని చూచీ, మైదానాలమీద పరుగులెడుతూన్న పిల్లల్ని చూచీ తాత్కాలికంగా తన ఏడుపు మరచిపోయాడు కృష్ణ. ఎవరో పరిచితుడు కన్పించగా మాటలలో పడిపోయాడు శేషాద్రి. ఎంత టైము గడిచిందోకూడా అతడు గమనించలేదు, ఆడుకొనే పిల్లలవేపునుండి పెద్ద కోలాహలం వినవచ్చేవరకూ. చుట్టూచూచి, కృష్ణ కన్పించకపోయేసరికి, ఆత్రంగా లేచి ఆ పిల్లలవేపుగా వెళ్ళి, అక్కడి దృశ్యంచూచి ఒక్కసారిగా నివ్వెరపడి నిలబడిపోయాడు. కారణం, ఆకోలాహలానికి కేంద్రం కృష్ణే! తనకంటె రెండుమూడేళ్ళు పెద్దవాడైన ఒక కుఱ్ఱవాడితో కలబడి పెద్ద కథానాయకుడిలాగా హోరాహోరి పోట్లాడుతున్నాడు. మిగిలిన పిల్లలంతా వినోదిస్తున్నారు. అది చూచి, ఆశ్చర్యం నుండి తేరుకున్న శేషాద్రి వడిగా వెళ్ళి, పోట్లాడుకుంటూ కుస్తీలు పడ్తూన్న యిద్దరు పిల్లల్ని విడదీసి నుంచోబెట్టాడు. ప్రేక్షకులుగా వున్న బాలలలో కొంచెం నిరాశ పొడచూపింది, కుస్తీపోటీ దృశ్యం ఆగిపోయినందుకు. కృష్ణ, ఒక్కసారి తండ్రి దెస బెదురుగా చూచాడు. అంతలో 'పిల్లగోంగూర. అదిగో, నాక్కావాలి,' అంటూ తన తిక్క ఏడుపు ప్రారంభించాడు.

ఏమీ పాలుపోలేదు శేషాద్రికి. "ఏమిటి బాబూ ! ఏం జరిగింది ?" అనడిగాడు అవతలి పిల్లవాడిని.

వాడింకా ఏడుస్తూ కళ్ళు తుడుచుకుంటూనే సమాధానం చెప్పాడు : "మీ అబ్బాయే వచ్చి నన్ను ముందు కొట్టాడండీ. ఈ పిల్లనగ్రోవి తన క్కావాలట. నేను దీన్ని మొన్ననే ఎగ్జిబిషన్‌లో కొనుక్కున్నాను. ఎందుకివ్వాలి ?" అన్నాడు బెదురుతూనే.

ఒక్కసారిగా పట్టరాని నవ్వు వచ్చింది శేషాద్రికి. అయినా తమాయించుకున్నాడు. "ఔనులే బాబూ! నువ్వు కొనుక్కున్న దెందుకిస్తావ్ ? మరి మా అబ్బాయి చాలా చిన్నవాడు కదూ? వాడి కేం తెలియదు, అందుకు కొట్టాడు" అంటూ ఆపిల్లవాడిని సమాధానపరచి, "రా బాబూ! నువ్వడుగుతున్న దేమిటో యిప్పటికి తెలిసింది నాకు. నేనుకొనిస్తాను రా," అన్నాడు కృష్ణను.

మొదట మొరాయించినా కృష్ణ తర్వాత ఒప్పుకుని మాట్లాడకుండా తండ్రి ననుసరించాడు.

తండ్రికుమారు లిద్దరూ యిల్లు చేరేసరికి ప్రక్కింటి పాప వీధిలోనే ఆడుకొంటోంది.

తమ గుమ్మంలో నిలబడివున్న తల్లి దగ్గరకు వెళ్ళలేదు కృష్ణ. పాప దగ్గరకు ఒక్కదూకు దూకి, సంతోషంగా తన చేతిలోని పిల్లనగ్రోవిని చూపుతూ, "ఇలుగో పాపా, మా నాన్నగాలు కొన్నాలు పిల్లగోంగూర !" అన్నాడు. అంతమాత్రం మాటలురాని పాప కళ్ళతోనే తన సంతోషమంతా ప్రదర్శిస్తూ తన పిల్లనగ్రోవి రంగులనూ, కృష్ణ క్రొత్తగా కొని తెచ్చుకున్న దాని రంగులనూ పోల్చి చూస్తోంది.

గుమ్మాలలో నిలబడి అంతా గమనించుతూన్న రాధ, సుహాసిని సిగ్గుతో చితికిపోతూ చూచుకోలేక చూచుకోలేక చూచుకున్నారు ఒకరివైపొకరు.

"పిల్లలూ, దేవుడూ చల్లనివారే...
కల్లకపట మెరుగనీకరుణామయులే..."

ఎదురింటి రేడియోలోనుంచి పాట వినవస్తోంది, చక్కటి సత్యాన్ని తెలియజెప్తూ.